క్లుప్తంగా

రక్షణ గోడలు నిర్మించాలి



పందూరులో రక్షణ గోడలు నిర్మించాల్సిన మినీ వంతెన

కోటవురట్ల: పందూరు గ్రామంలో మధ్యలో గెడ్డపై ఉన్న మినీ వంతెనకు రక్షణ గోడలు లేకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మినీ వంతెన మీదుగా నిత్యం జనం రాకపోకలు సాగిస్తారు. చిన్నారులు బడికి వెళ్లాలన్నా ఈ వంతెన దిక్కు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకు వెళ్లేందుకు ఈ మినీ వంతెనను దాటాల్సిందే. రాత్రి వేళల్లో ఆదమరిస్తే గెడ్డలో పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి మినీ వంతెనకు రక్షణ గోడలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అదుపు తప్పిన కారు



ప్రమాదానికి గురైన కారు

నక్కపల్లి: జాతీయ రహదారిపై కాగిత సమీపంలో ఆదివారం ఓ కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. అదృష్టవశాత్తూ కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విశాఖకు చెందిన ఓ కుటుంబం కారులో అన్నవరం బయలు దేరింది. వారు ప్రయాణిస్తున్న కారుకు ఆవు అడ్డు రావడంతో అదుపు తప్పి ఢీకొట్టింది. ఆవు కారుపై పడటంతో ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు మినహా మిగతా వారికి గాయాలు కాలేదు.

26 మద్యం బాటిళ్లతో మహిళ అరెస్ట్



మద్యం బాటిళ్లతో పట్టుబడిన మహిళతో పోలీసులు

మునగపాక(అచ్యుతాపురం): మునగపాక మండలంలోని నాగులాపల్లి రైస్ మిల్లు వద్ద అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఓ మహిళను ఆదివారం అరెస్ట్ చేసినట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వై.ఎల్.నాయుడు తెలిపారు. ఆమె వద్ద నుంచి 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో కె.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఊరేగింపు



అయ్యప్పస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

మునగపాక(అచ్యుతాపురం): మునగపాక మండలంలోని తిమ్మరాజుపేటలో అయ్యప్ప స్వామిని భక్తులు ఆదివారం వీధుల్లో ఘనంగా ఊరేగించారు. అయ్యప్పస్వాములు పేటతుళ్లి ఆడుతూ శరణు వేడుకుంటూ ఊరేగారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం నేడు

దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభిస్తారని మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారుల సమక్షంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయ, సివిల్ సప్లయి జిల్లా అధికారులు హాజరవుతారని ఆమె తెలిపారు.

ఉప్పుటేరు.. కాలుష్య కాసారం.!

- కొంప ముంచుతున్న ఫార్మా వ్యర్థాలు
- మత్స్య సంపదకు అపార నష్టం
- ఇక్కడ తయారైన ఉప్పూ ప్రమాదమే.!



పూడిమడక ఉప్పుటేరు

అచ్యుతాపురం: నీరు జీవజాతికి ప్రాణాధారం.. ఆ నీరే కలుషితమైతే జీవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇందుకు అచ్యుతాపురం మండలంలోని ఉప్పుటేరే నిదర్శనం. మత్స్యకారులకు ఉపాధినిచ్చే ఉప్పుటేరు కాలుష్య కాసారంగా మారుతోంది. ఫార్మా కంపెనీల వ్యర్థాలతో నిండిపోయి విష పూరితంగా తయారైంది. దీంతో మత్స్య సందపకు ఉప్పు వాటిల్లుతోంది. ఫలితంగా మత్స్యకారులకు కీలకమైన ఉప్పుటేరును చూస్తే కన్నీరు కార్చాల్సి వస్తోంది. అధికారుల పర్యవేక్షణ లోపం, పాలకుల అలసత్వం, కంపెనీల స్వార్థం వెరసి అచ్యుతాపురం మండలంలోని ఉప్పుటేరు కలుషితమవుతోంది.

ఫార్మా.. ఏంటీ ఖర్మా?

అచ్యుతాపురం సెజ్ వచ్చిన తర్వాత పరిసర ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. కానీ పది వేల ఓటర్లు ఉన్న పూడిమడకకు ఆధారమైన ఉప్పుటేరును ఫార్మా కంపెనీలు పుట్టిముంచుతున్నాయి. ఒక వైపు వాయు కాలుష్యం, మరో వైపు జల కాలుష్యానికి కారణమవుతున్నాయి. ఫార్మా కంపెనీల్లో ఔషధాలు తయారు చేస్తున్నప్పుడు ప్రమాదకర రసాయన వ్యర్థాలను శుద్ధి చేసి వదలాలి. కానీ ఇక్కడ వర్షం పడినప్పుడు శుద్ధి చేయని నీటి వ్యర్థాలను కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఇది పూడిమడక ఉప్పుటేరులోకి చేరడంతో నీరంతా కలుషితం అవుతోంది. తద్వారా ఉప్పుటేరులో ఉన్న మత్స్య సంపద మృత్యువాత పడుతోంది.

ఉప్పు ప్రమాదమే.!

పూడిమడక గల్లీల్లో తయారు చేసే ఉప్పు కూడా ప్రమాదకరమన్న అనుమానం వ్యక్తమవుతోంది. ఉప్పుటేరులోని రసాయన వర్థాల అవశేషాలు ఇక్కడి ఉప్పులో కూడా ఉండొచ్చనే అనుమానాలు ఉన్నాయి.

విష పాములకు ఆవాసం



కొద్ది నెలల క్రితం ఉప్పుటేరులో ప్రమాదకర పాములు నీటిలో తేలియాడుతూ కనిపించాయి. వాటిని కర్రల సహాయంతో ఒడ్డుకు తెచ్చి పడేసినప్పుడే రసాయనాన్ని కక్కి మరణించాయి. అది అప్పట్లో సంచలనంగా మారింది.



ఉప్పుటేరులో మృతి చెందిన చేపలు

ఇటువంటి సున్నితమైన ఉప్పుటేరు విషయంలో సంబంధిత శాఖ అధికారులు స్పందించి కాలుష్య కోరల్లోంచి రక్షించాలని పలువురు కోరుతున్నారు.

చాలా ఇబ్బంది పడుతున్నాం..

పూడిమడకలోని ఉప్పుటేరులో రసాయనాలు కలుస్తున్నాయి. దీంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. చాలా సార్లు ఇలా జరిగింది. అధికారులు నిష్పక్షపాతంగా నివేదిక ఇవ్వాలి. నివేదికలు మారుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

– వాసుపల్లి శ్రీనివాసరావు, పూడిమడక

శాంపిల్స్ పంపించాం..

కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఉప్పుటేరును సందర్శించి శాంపిల్స్ సేకరించారు. మేము కూడా ఉప్పుటేరు నీటి శాంపిల్స్ పంపించాం. మత్స్యకారుల శ్రేయస్సే మాకు ముఖ్యం. దేనికైనా ఆధారాలు ఉండాలి.

– రవిరాజ్, మత్స్యశాఖ అచ్యుతాపురం పరిధి అధికారి

నివేదిక బట్టి చర్యలు..

నివేదిక బట్టి తదుపరి చర్యల కోసం సిఫారసు చేస్తాం. ఇప్పటి వరకూ ఎటువంటి నివేదిక రాలేదు. ఈ విషయాన్ని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు నివేదించాం.

– హరిప్రసాద్, జెడ్ఎం, ఏపీఐఐసీ

ఉప్పుటేరు నీరు ప్రమాదకరం కాదు

ఉప్పుటేరు నీరు ప్రమాదకరం కాదు. ఎక్కడా ఫార్మా కంపెనీల వ్యర్థాలు కలుస్తున్నట్టు ఆధారాలు లేవు. ఆయా ప్రాంతాల్లో పరిశీలించాం. కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ 250 లోపే ఉంది. దీని వల్ల జీవాలకు ఎటువంటి ప్రమాదం ఉండదు. అయినా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. శాంపిల్స్ ఫలితాలు అందరికీ పంపిస్తాం.

– ముకుందరాజు, పర్యావరణ ఇంజినీర్

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడితో రాంబిల్లి పోలీసులు

రాంబిల్లి(యలమంచిలి): చోరీ కేసులో నిందితుడిని రాంబిల్లి పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేశారు. రాంబిల్లి సీఐ సిహెచ్.నర్సింగరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కె.నాగేశ్వరరావు ఇంట్లో ఈ నెల 1న బంగారం చోరీకు గురైనట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. యలమంచిలిలో ఉంటున్న పతివాడ గణేష్ అనే వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్టు దర్యాప్తులో తేలింది. నిందితుడి నుంచి చోరీకి గురైన బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గణేష్ గతంలో చాలా చోరీ కేసుల్లో పట్టుబడినట్లు రాంబిల్లి సీఐ తెలిపారు.

జాతీయ ప్రచార కమిటీ అధ్యక్షుడిగా రాంబాబు



నక్కపల్లి: అఖిల భారత భవానీ దీక్షా చారిటబుల్ ట్రస్ట్ జాతీయ కమిటీలో ఉపమాకకు చెందిన గురు భవానీ దవరసింగు రాంబాబుకు చోటలభించింది. ఆదివారం విజయవాడలో జరిగిన ట్రస్ట్ జాతీయ కమిటీ సమావేశంలో రాంబాబును ట్రస్ట్ జాతీయ ప్రచార కమిటీ అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ట్రస్ట్ జాతీయ అధ్యక్షుడు లంకా గణేష్ ప్రకటించారు. గతంలో తాను ప్రచార కమిటీ కార్యదర్శిగా పని చేశానని రాంబాబు తెలిపారు. రాంబాబు నియామకంపై పలువురు భవానీ భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

19న చలో అమరావతి



కరపత్రం విడుదల చేస్తున్న డీబీపీ నాయకులు

పాయకరావుపేట ఈ నెల 19న జరిగే చలో అమరావతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ(డీబీపీ) రాష్ట్ర నాయకురాలు దాసరి అన్నపూర్ణ కోరారు. ఈ మేరకు ఆ పార్టీ నేతలు ఆదివారం పరివర్తన నిలయంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళితుల భవిష్యత్తును దెబ్బ తీయడానికి కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, కేంద్రంలో బీజేపీ సర్కారు ఎస్సీ వర్గీకరణ చేపట్టాయని ఆరోపించారు. ఆందోళన సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు పాయకరావుపేట అసెంబ్లీ ఇన్‌చార్జి బడుగు అచ్చారావు, పార్టీ నాయకులు బోడపాటి లక్ష్మి, చిరుకూరి అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

తోటాడలో గీతా జయంత్యుత్సవాలు



శ్లోకాలు పఠిస్తున్న చిన్నారులు

మునగపాక(అచ్యుతాపురం): మునగపాక మండలంలోని తోటాడలో ఉన్న ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గీతా జయంత్యుత్సవాలు నిర్వహించారు. చిన్నారులు భగవద్గీతలో శ్లోకాలు పఠించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ ఎస్.కుమార్, సర్పంచ్ దొడ్డి మంగవేణి, కోటేశ్వరరావు మాట్లాడుతూ చిన్నారుల్లో భగవద్గీత పట్ల ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పెంటకోల చలం, గెడ్డం సూర్యనారాయణ, చంద్ర కళారాజు, నూక లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే.!



ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న పెద్ద గొయ్యి

కోటవురట్ల: రహదారుల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. పెద్ద గోతులతో అధ్వానంగా తయారవ్వడంతో నిత్యం దినదిన గండంగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నర్సీపట్నం-రేవుపోలవరం ప్రధాన రహదారిలో రామచంద్రపురం జంక్షన్ నుంచి నర్సీపట్నం మండలం అడ్డురోడ్డు వరకు రహదారి దారుణంగా తయారైంది. గోతులను తప్పించే అవకాశం లేకపోవడంతో చెరువులా ఉన్న గోతుల్లో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డులో అడుగడుగునా గోతులతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే గోతులు నిండిపోయి చెరువును తలపిస్తున్నాయి. అసలే ఇరుకురోడ్డు కావడంతో గోతులతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

మామిడి తోటలకు స్వచ్ఛంద బీమా అమలు

కె.కోటపాడు : మామిడితోటలకు సంబంధించి 2024–25 కాలానికి స్వచ్ఛంద బీమా పథకం అమలులో ఉన్నట్టు ఉద్యానవనశాఖాధికారి కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు. బీమాలో ఉన్న మామిడి తోటలకు వాతావరణ ఆధారితం అనగా అకాల వర్షాలు, వాతావరణంలో తేమ శాతం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటకు నష్టం కలిగినట్టు గుర్తిస్తే సంబంధిత రైతులకు బీమా నగదు అందుతుందని తెలిపారు. ఈ బీమాలో చేరేందుకు ఎకరానికి రైతులు రూ.2200 అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ పేరిట చెల్లించాలన్నారు. తోటలకు నష్టం కలిగే పరిస్థితుల్లో బీమా కింద ఎకరానికి రూ.44వేల నగదును అందుతుందని తెలిపారు. ఆధార్‌కార్డు, భూమి పత్రాలు, పంట సాగు ధ్రువీకరణపత్రం, బ్యాంక్ పాస్ పుస్తకం, ఫోన్ నంబర్‌లతో నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో మామిడి పంటకు బీమా పథకంలో చేరవచ్చునని ఆమె తెలిపారు. సాగు రైతులు ఈ నెలలోగా చేరాలని ఆమె సూచించారు.

మామిడిలో అంతర పంటగా నువ్వు సాగు



అగ్రహారంలో అంతర పంటగా సాగులో ఉన్న నువ్వు పంట

కె.కోటపాడు : అంతర పంటల సాగు విధానంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల్లో గల రైతులు మామిడి పంటలో అంతర పంటగా నువ్వు పంటను సాగు చేస్తున్నారు. మొక్కదశలో ఉన్న మామిడి తోటల గల మధ్య గల ఖాళీ ప్రాంతంలో నువ్వు పంటను సాగు చేస్తున్నారు. చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం, కొరువాడ, కె.కె.అగ్రహారం గ్రామాల్లో 30 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మామిడి పూతదశకు చేరుకున్న సమయంలో నువ్వు పంట కోత దశకు చేరుకుంటుందని సాగు రైతులు తెలిపారు. అంతర పంటల వల్ల సాగు లాభదాయకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అ‘పూర్వ’ం.. ఆత్మీయ సమ్మేళనం



మునగపాక హైస్కూల్‌లో సమావేశమైన 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



దేవీపురంలో సమావేశమైన హరిపాలెం ఉన్నత పాఠశాల 1992-93 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

మునగపాక(అచ్యుతాపురం): వారంతా ఒకే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకొని నేడు వేర్వేరు రంగాల్లో వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. ఆదివారం కలుసుకుని సందడి చేశారు. ఏరా నేస్తం... ఎన్నాళ్లయిందిరా..! బాగున్నావా..? పిల్లలు ఎంత మంది? ఎలా ఉన్నావు.. ఏం చేస్తున్నావు.. అంటూ కుసల ప్రశ్నలతో ఆ ప్రాంతం సందడిగా మారింది. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. మునగపాక ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1995–96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం అందరూ కలిసి భోజనం చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. డ్యాన్స్‌లతో సాయంత్రం వరకు హుషారుగా గడిపారు.

దేవీపురంలో హరిపాలెం పూర్వ విద్యార్థుల సందడి

అచ్యుతాపురం: మండలంలోని హరిపాలెం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సబ్బవరంలోని దేవీపురంలో ఆదివారం వనసమారాధన నిర్వహించారు. 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒక చోట కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సాయంత్రం వరకూ సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెంటకోట జయ అప్పారావు, మళ్ల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

కశింకోట: రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తెలిపారు. ఆదివారం అనకాపల్లిలో మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు, పదవీ విరమణ చేసిన వారికి పింఛన్లు అందజేస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల బకాయిలను దశల వారీగా చెల్లించడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. 117 జీవో రద్దుకు చర్యలు ప్రారంభించిందన్నారు. ఇతర సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టిందన్నారు. దీనివల్ల ఉపాధ్యాయుల సమస్యలన్ని పరిష్కారం కాగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలికి ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఓటర్లుగా అర్హులంతా నమోదు చేసుకోవాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికి దుర్గాప్రసాద్, కార్యదర్శి దేముడు బాబు, పట్టణ శాఖ అధ్యక్షుడు కొణతాల గణేష్, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ, కార్యదర్శి నక్కా శ్రీనుబాబు, రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఏపీ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి

తుమ్మపాల: ఎస్. రాయవరం మండలం కొరుప్రోలు గ్రామానికి చెందిన శానిటేషన్ కార్మికురాలు ఏడిద కుమారి (40) కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని ఏపీ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.శివలక్ష్మి, పి.జానకి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావుతో కలిసి వారు మాట్లాడారు. శుక్రవారం ప్రాథమిక పాఠశాలలో కుమారి మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందారని వాపోయారు. శానిటేషన్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడం, ప్రమాదవశాత్తు మృతి చెందినా ఇన్సూరెన్స్ లేకపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. ఇప్పటికే శానిటేషన్ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే బకాయి జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ వంటి సౌకర్యాలు వెంటనే కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

మాడుగుల రూరల్ : నీటి సంఘాలు ఎన్నికలు ఈ నెల 14వ తేదీన నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్టు మండల ఇరిగేషన్ జేఈ భార్గవ్‌కుమార్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు. మండలంలో 8 మధ్య తరహా, 14 చిన్నతరహా నీటి సంఘాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు గ్రామాల్లో సంఘాలు ఓటర్ల జాబితాలు విడుదల చేశామన్నారు. మధ్య తరహా నీటి సంఘానికి సంబంధించి 12 మంది డైరెక్టర్లు, చిన్నతరహా నీటి సంఘానికి సంబంధించి ఆరుగురు డైరెక్టర్లు ఉంటారని, వీరి నుంచి ఒకరు అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను మిగిలిన డైరెక్టర్లు ఎన్నికుంటారని జేఈ భార్గవ్‌కుమార్ తెలిపారు.

దత్తపీఠంలో సప్తాహ మహోత్సవం

మాడుగుల రూరల్ : వీరవల్లి అగ్రహారం శ్రీదత్త పీఠంలో సప్తాహ కార్యక్రమం ఆదివారం ప్రారంభం అయింది. ఈ నెల 15 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిరాంటకంగా జరుగుతుందని పీఠాధిపతి డి. శ్రీనివాస భరణిశర్మ తెలిపారు. దత్త భజన మండలి సభ్యులు, గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముగింపు రోజు ఈ నెల 15 న ఉదయం హోమం, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం పల్లకీ సేవ జరుగుతుందన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు



మునగపాకలో చెట్ల కొమ్మలు తొలగిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

మునగపాక: మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. కొంత కాలంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మల కారణంగా వినియోగదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత ఏఈ గోపీకృష్ణ స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో చెట్ల కొమ్మలను తొలగించే చర్యలు చేపట్టడంపై వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 19, 20, 21 తేదీల్లో మచిలీపట్నంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన జి.గౌతమ్, జి.హర్షిత, ఎ.హర్షిత బంగారు పతకాలు సాధించారు. ఈ ముగ్గురూ సోమవారం ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి తెలిపారు. విజేతలను, కోచ్‌లు అమర్‌నాథ్, అన్నపూర్ణలను పాఠశాల సీఈవో కె.నిశాంత్ అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.